

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 09-12-2025 | సంపుటి - 26 | సంచిక -202 | రూ : 4 | పేజీలు: 8


## చైనాలోని ఆ ప్రావిన్స్ ను

# స్ఫూర్తిగా తీసుకున్నాం

### గ్లోబల్ సదస్సులో రేవంత్ రెడ్డి

- కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందన్న ముఖ్యమంత్రి
- 2047 నాటికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామన్న ముఖ్యమంత్రి
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది మా ఆశయమని వెల్లడి

2లో









2లో

## తెలంగాణ హైకోర్టులో

## ఐఏఎస్ ఆమ్రపాలికి చుక్కెదురు

- తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే
- ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ అక్టోబర్‌లో డీవోపీటీ ఉత్తర్వులు
- క్యాట్‌లో సవాల్ చేయడంతో ఆమ్రపాలికి అనుకూలంగా ఉత్తర్వులు

## ఇండిగో ప్రయాణికులకు

# రూ.827 కోట్ల రిఫండ్

- మిగిలిన వారికి డిసెంబర్ 15 లోగా చెల్లింపులు జరుపుతామని వెల్లడి
- డిసెంబర్ 1 నుంచి 7 వరకు 5,86,705 టిక్కెట్లు రద్దు
- రూ.570 కోట్లు ప్రయాణికులకు అందినట్లు ప్రకటన




2లో




2లో

## 2026 ఏడాదికి సెలవులు ఖరారు చేసిన

## తెలంగాణ ప్రభుత్వం

- 27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు తెలంగాణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి
- భోగి మొదలు క్రిస్మస్ మరుసటి రోజు వరకు 27 సాధారణ సెలవులు



2లో

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

## రూ.3 కోట్ల రివార్డున్న

# కమాండర్ లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది మావోయిస్టుల లొంగుబాటు
- ఎంఎంసీ జోన్ బాధ్యతలు చూస్తున్న రాంధేర్

## జాతీయ సగటును మించిన

# ఏపీ జీఎస్‌డీపీ..



2లో

### గణాంకాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు

- సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్
- 2025-26 తొలి అర్ధ సంవత్సరంలో 10.91 శాతం జీఎస్‌డీపీ వృద్ధి నమోదు
- పారిశ్రామిక రంగంలో 12.05 శాతం, సేవల రంగంలో 11 శాతం వృద్ధి
- గత ఐదేళ్లలో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నష్టపోయిందన్న సీఎం

## ట్రంప్ మీడియా టెక్నాలజీస్

# భారీ పెట్టుబడులు



2లో

- తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ఆసక్తి
- పెట్టుబడులు పెడతామని ట్రంప్ మీడియా టెక్నాలజీస్ డైరెక్టర్ వెల్లడి
- పదేళ్లలో రూ.1 లక్ష కోట్లు పెట్టుబడులు

# చైనాలోని ఆ ప్రావిన్స్ ను స్ఫూర్తిగా తీసుకున్నాం: గ్లోబల్ సదస్సులో రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 8: చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గ్వాంగ్‌డాంగ్ రెండు దశాబ్దాల్లోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో ఆయన మాట్లాడుతూ, కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047 నాటికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది తమ ఆశయమని అన్నారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలను, అభిప్రాయాలను స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలనేది తమ ఆశయమని అన్నారు. లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడితే అసాధ్యమేమీ కాదని అన్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో తెలంగాణ కల సాకారమైందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోనే తెలంగాణ కొత్త రాష్ట్రమని, దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నప్పటికీ, 5 శాతం ఆదాయం ఇస్తున్నామని అన్నారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించామని అన్నారు. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించామని అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నామని అన్నారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకు వెళుతున్నామని అన్నారు. అది 20 ఏళ్లలోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని వెల్లడించారు. ఇక్కడ కూడా గ్వాంగ్‌డాంగ్ నమూనాను అమలు చేయదలిచామని అన్నారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలు మాకు ఆదర్శమని అన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..
## రూ.3 కోట్ల రివార్డున్న కమాండర్ లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్, డిసెంబర్ 8: మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, రూ.3 కోట్ల రివార్డు ఉన్న కీలక నేత రాంధేర్ కూడా ఉండటం గమనార్హం. రాంధేర్ చాలాకాలంగా ఎంఎంసీ (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) జోన్‌లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మిలింద్ తెల్టుంబే మరణించిన తర్వాత ఆయన ఎంఎంసీ బాధ్యతలను స్వీకరించారు. ఈ జోన్‌లో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న రాంధేర్ లొంగుబాటును పోలీసులు కీలక విజయంగా పరిగణిస్తున్నారు. తాజాగా రాంధేర్ లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు దాదాపుగా నక్సల్స్ రహితంగా మారాయని అధికారులు భావిస్తున్నారు. ఇది భద్రతా బలగాలకు వ్యూహాత్మకంగా ఎంతో మేలు చేస్తుందని విశ్లేషిస్తున్నారు. ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోతున్న విషయం తెలిసిందే.

## జాతీయ సగటును మించిన ఏపీ జీఎస్‌డీపీ...
## గణాంకాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 8: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ తిరిగి ప్రగతి పథంలో పరుగులు పెడుతోంది. 2025 26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధిరేటు 10.91 శాతంగా నమోదైంది. ఇదే కాలానికి జాతీయ సగటు 8.8 శాతంతో పోలిస్తే ఇది గణనీయంగా అధికం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రంగాల వారీగా ఆర్థిక ప్రగతి వివరాలను వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక రంగం తిరిగి గాడిలో పడిందని, అన్ని రంగాల్లోనూ సానుకూల వృద్ధి కనిపిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

**రంగాల వారీగా ప్రగతి ఇలా...!**

202526 రెండో త్రైమాసికం నాటికి వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో బలమైన వృద్ధి నమోదైనట్లు సీఎం వివరించారు. ఈ త్రైమాసికంలో వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల విలువ జోడింపు (జీవీఏ) రూ.1,25,571 కోట్లుగా ఉండగా, పారిశ్రామిక రంగం జీవీఏ రూ.86,456 కోట్లు, సేవల రంగం జీవీఏ రూ.1,60,075 కోట్లుగా నమోదైంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగం 2.78 శాతం నుంచి ఏకంగా 12.20 శాతానికి ఎగబాకి జాతీయ సగటును అధిగమించడం విశేషం. వ్యవసాయ రంగంలో 11.43 శాతం వృద్ధిరేటు సాధించగా, అందులో మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో రికార్డు స్థాయిలో 26.27 శాతం వృద్ధి కనిపించింది. వరి దిగుబడి గతంతో పోలిస్తే 23.95 శాతం పెరిగి 3.64 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. అరటి దిగుబడిలో అనూహ్యంగా 151.2 శాతం వృద్ధితో 37.31 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. మత్స్య, రొయ్యల దిగుబడి కూడా వరుసగా 17.30, 27.09 శాతం పెరిగింది. పారిశ్రామిక రంగంలో మైనింగ్ 18.43 శాతం, తయారీ రంగం 11.66 శాతం, నిర్మాణ రంగం 11.81 శాతం వృద్ధిని నమోదు చేశాయి. విద్యుత్ ఉత్పత్తి 19.12 శాతం పెరిగి 26,837 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. సేవల రంగంలో రియల్ ఎస్టేట్ 14.31 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, ఆతిథ్య రంగం 8.50 శాతం, రవాణా రంగం 5.99 శాతం వృద్ధిని సాధించాయి. ఈ త్రైమాసికంలోనే జల రవాణా ద్వారా 52.50 మిలియన్ టన్నుల కార్గో రవాణా జరగగా, 14.98 లక్షల మంది విమాన ప్రయాణాలు చేశారు.

**గత ఐదేళ్ల పాలనతో పోలిక**

ఈ సందర్భంగా 201419 మధ్య టీడీపీ పాలన, 201924 మధ్య గత ప్రభుత్వ పాలనలో నమోదైన వృద్ధిరేటును చంద్రబాబు పోల్చిచూపారు. 2014 19 మధ్య జీఎస్‌డీపీ వృద్ధి 13.49 శాతంగా ఉంటే, 2019-24 మధ్య అది 10.32 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రం సుమారు రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీని నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే వృద్ధి కొనసాగి ఉంటే రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చి ఉండేదని విశ్లేషించారు. తలసరి ఆదాయంలో కూడా ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపించిందని, 201819లో రూ.1,54,031గా ఉన్న తలసరి ఆదాయం 2023-24 నాటికి రూ.2,37,951కి మాత్రమే పెరిగిందని, కానీ తమ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే దానిని రూ.2,66,240కి పెంచగలిగామని తెలిపారు. ఇది ప్రస్తుత జాతీయ తలసరి ఆదాయం రూ.2,05,324 కంటే ఎక్కువని గుర్తుచేశారు.

**భవిష్యత్ లక్ష్యాలు.. స్వర్ణాంధ్ర-2047**

ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంలోనే రూ.7,58,270 కోట్ల జీఎస్‌డీపీ సాధించామని, వార్షిక లక్ష్యంలో ఇది 41 శాతమని చంద్రబాబు తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి రూ.18,65,704 కోట్ల జీఎస్‌డీపీతో 17.11 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. 2014-19 మధ్య సాధించిన 13.49 శాతం వృద్ధిరేటును కొనసాగించగలిగితే స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.292 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.49 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. సుస్థిర ప్రగతితో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ట్రంప్ మీడియా టెక్నాలజీస్ భారీ పెట్టుబడులు

హైదరాబాద్, డిసెంబర్ 8: 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' సదస్సు నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. సదస్సు వేదికగా కంపెనీ డైరెక్టర్ ఎరిక్ ఈ విషయాన్ని ప్రకటించారు. రానున్న పదేళ్లలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

* **'ఫ్యూచర్ సిటీ'కి సీఐఐ మాజీ చైర్మన్ కితాబు**

ఫ్యూచర్ సిటీ పేరుతో తెలంగాణలో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని సీఐఐ మాజీ చైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో తాము ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నామని అదానీ గ్రూప్ తెలిపింది. గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, సిమెంట్ రంగంలో పెట్టుబడులు పెడుతున్నామని, డిఫెన్స్, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేశామని అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా యూఏవీ సాంకేతికతను హైదరాబాద్‌లో రూపొందిస్తున్నామని తెలిపారు. ఇక్కడ తయారయ్యే యూఏవీలను సైన్యానికి అందిస్తామని, ప్రపంచ మార్కెట్‌లో కూడా విక్రయిస్తామని ఆయన అన్నారు.

## జపాన్ లో భారీ భూకంపం... సునామీ హెచ్చరికలు జారీ

జపాన్, డిసెంబర్ 8 : ఉత్తర జపాన్‌ను సోమవారం రాత్రి భారీ భూకంపం వణికించింది. హొక్కైడో ప్రాంతంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదైంది. భూమి తీవ్రంగా కంపించడంతో అధికారులు వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7:45 గంటలకు ఈ భూకంపం సంభవించింది. హొక్కైడో తీరానికి సమీపంలో, భూమికి 32 మైళ్ల లోతున దీని కేంద్రం ఉన్నట్లు యూఎస్‌జీఎస్ (USGS) ప్రాథమికంగా వెల్లడించింది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. అణు విద్యుత్ కేంద్రాలకు కూడా ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కాగా, గత నెల నవంబర్ 9న కూడా ఉత్తర జపాన్‌లో 6.9 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా సునామీ హెచ్చరికలు జారీ చేసి, కొన్ని గంటల తర్వాత ఉపసంహరించుకున్నారు. అప్పుడు ఎలాంటి పెద్ద నష్టం జరగలేదు. పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో జపాన్‌లో తరచుగా భూకంపాలు, సునామీలు సంభవిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను అమలు చేస్తోంది.

## ఇండిగో ప్రయాణికులకు రూ.827 కోట్ల రిఫండ్

ఢిల్లీ, డిసెంబర్ 8: విమాన సర్వీసులు నడపలేక తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న ఇండిగో ఎయిర్ లైన్స్ ఇప్పటివరకు పలువురు ప్రయాణికులకు రూ.827 కోట్లు రిఫండ్ చేసింది. మిగిలిన వారికి డిసెంబర్ 15 లోగా చెల్లింపులు జరుపుతామని వెల్లడించింది. ఇండిగో విమాన సర్వీసుల్లో అంతరాయం వల్ల నవంబర్ 21 నుంచి డిసెంబార్ 1 వరకు 9,55,591 టిక్కెట్లు రద్దయినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. వీటి విలువలో రూ.827 కోట్లు రిఫండ్ చేసినట్లు పేర్కొంది. డిసెంబర్ 1 నుంచి 7 వరకు 5,86,705 టిక్కెట్లు రద్దు కాగా, రూ.570 కోట్లు ప్రయాణికులకు అందినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. విమానాల సర్వీసుల రద్దు వల్ల వివిధ విమానాశ్రయాల్లో దాదాపు 9,000 బ్యాకేజీలు నిలిచిపోయినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వాటిలో 4,500 బ్యాగులను ఇప్పటికే ప్రయాణికులకు అందజేసినట్లు తెలిపింది. వచ్చే 36 గంటల్లో మిగిలిన వాటిని డెలివరీ చేసేందుకు ఇండిగో ఏర్పాటు చేస్తోంది. సోమవారం మొత్తం 500 సర్వీసులు రద్దయ్యాయని వెల్లడించింది. ఇదిలా ఉండగా, సర్వీసుల పునరుద్ధరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు తమ మాతృసంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ ప్రత్యేకంగా ఒక క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు ఇండిగో తెలిపింది. డిసెంబర్ 4న జరిగిన బోర్డు సమావేశంలో దీని ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

## ప్రారంభమైన "తెలంగాణ గ్లోబల్ సమ్మిట్"..
## ప్రముఖులకు 'రోబో' ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 8: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' ప్రారంభమైంది. ఈ సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సినీ నటుడు నాగార్జున, దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తదితరులు హాజరయ్యారు. సదస్సుకు వచ్చిన ప్రముఖులను 'రోబో' ఆహ్వానించడం అందరినీ ఆకట్టుకుంది. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో జరుగుతున్న ఈ సదస్సు నేడు, రేపు కొనసాగుతుంది. 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు



హాజరవుతున్నారు. సదస్సు ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడకి చేరుకుని స్టాళ్లను పరిశీలించారు. వివిధ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సులో తెలంగాణ తల్లి డిజిటల్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఈ సదస్సులో వివరిస్తారు.

## 2026 ఏడాదికి సెలవులు
## ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 8: 2026 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ మరియు ఐచ్ఛిక సెలవుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవుల్లో భోగి, సంక్రాంతి, గణతంత్ర్య దినోత్సవం, మహాశివరాత్రి, హోలి, ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, గుడ్ ఫ్రైడే, బాబు జగ్జీవన్ రామ్ జయంతి, డాక్టర్ అంబేద్కర్ జయంతి, బక్రీద్, మొహర్రం, బోనాలు, స్వాతంత్ర్య దినోత్సవం, ఈద్ మిలాద్ ఉన్ నబీ, శ్రీ కృష్ణాష్టమి, వినాయక చవితి, మహాత్మా గాంధీ జయంతి, సద్దుల బతుకమ్మ, విజయ దశమి, దీపావళి, కార్తీక పౌర్ణమి, క్రిస్మస్ ఉన్నాయి. రంజాన్, విజయదశమి, క్రిస్మస్ పండుగల మరుసటి రోజు కూడా సాధారణ సెలవుగా ప్రకటించింది.

## 'తాగుబోతుల తెలంగాణ'గా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు



హైదరాబాద్, డిసెంబర్ 8: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు మొండి చేయి చూపిందని, పాలన పూర్తిగా ఆగమాగంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పూర్తిస్థాయి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని... నిరూపించలేకపోతే రాజీనామాకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల పాలన అనేది ప్రభుత్వ పనితీరుకు గీటురాయిలాంటిదని, కానీ ఈ ప్రభుత్వం నిస్సారంగా, నిరర్థకంగా మిగిలిపోయిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. "ఈ రెండేళ్లలో ఆత్మస్తుతి, పరనింద తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు. మా ప్రభుత్వం రాగానే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు తెచ్చాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా దర్బార్ కూడా ఇప్పుడు అమలు కావడం లేదు. కేసీఆర్ తెచ్చిన మెట్రో రైలు, ఫార్మా సిటీ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేయడం మినహా వీరేమీ చేయలేదు" అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. "మక్కలు కొని 50 రోజులు దాటినా రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వలేదు. రైతులకు బేడీలు వేసిన ఈ ప్రభుత్వం రైతు సంక్షోభ ప్రభుత్వం. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మద్యం దుకాణాలకు నోటిఫికేషన్లు ఇచ్చి రాష్ట్రాన్ని 'తాగుబోతుల తెలంగాణ'గా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు" అని విమర్శించారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు అడిగితే విజిలెన్స్, ఏసీబీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్‌ను "గోబెల్స్ సమ్మిట్" అని ఎద్దేవా చేశారు. "గతంలో దావోస్ వెళ్లి డొల్ల కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని రేవంత్ నవ్వులపాలయ్యారు.

## తెలంగాణ హైకోర్టులో
## ఐఏఎస్ ఆమ్రపాలికి చుక్కెదురు

హైదరాబాద్, డిసెంబర్ 8: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెను తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తూ అక్టోబరులో డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఆమె క్యాట్‌లో సవాల్ చేశారు. దీంతో ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై డీవోపీటీ హైకోర్టులో అప్పీల్ చేసింది. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలి తరఫు న్యాయవాదిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

# ప్రజా సేవకై.. సర్పంచ్ బరిలో ఉన్నత విద్యావంతురాలు...

- **బిజిలిపూర్ సర్పంచ్‌గా ఆశీర్వదించండి..**
- **మంత్రి దామోదర్ సహకారంతో అభివృద్ధి చేసి చూపిస్తా...**
- **ఉంగరం గుర్తును గుర్తించుకొని ఓటేయండి ...**
- **సర్పంచ్ అభ్యర్థి అరగొండ మహానంద అరవింద్...**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ఒకప్పుడు సర్పంచ్ ఎన్నికలంటే ఊరి పేరు మోసిన పెద్ద మనుషుల వ్యవహారంగా సాగేది. కానీ కాలం మారింది. దశాబ్ద కాలంగా విద్యావంతులు, వివిధ ప్రొఫెషనల్స్ సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉన్న ఊరికి సేవ చేయాలని పాలిటిక్స్ లో తొలి అడుగు వేయాలని ముందుకు వస్తున్న వారిలో అరగొండ మహానంద అరవింద్ ఒకరు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ హిందీ, ఎం.ఏ.బి.ఎడ్ చదివిన ఆమె, సమాజ అభివృద్ధినే పరమావధిగా, సమాజ సేవనే లక్ష్యంగా పెట్టుకుని ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ ఉద్యోగాన్ని వదిలి ఊరికి ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు కదులుతున్నారమే.వట్పల్లి మండలం లోని బిజిలిపూర్ సర్పంచ్ అభ్యర్థిగా ఉన్నత విద్యావంతురాలైన అరగొండ మహానంద ఇప్పుడు గ్రామ రాజకీయాల్లో నూతన శక్తిగా మారుతున్నాతున్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేయాలనే సంకల్పంతో వచ్చిన మహానంద ఈసారి సర్పంచ్ బరిలో తన నామినేషన్ దాఖలు చేసి గ్రామ ప్రజల ఆశలకూ ఆకాంక్షలకూ ప్రతినిధిగా నిలిచారు.

*** ప్రచారంలో తరలివస్తున్న యువకులు, మహిళలు..**

మహానంద ఎన్నికల ప్రచార పర్వంలో గ్రామంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో యువకులు, మహిళలు, వృద్ధులు స్వయంగా హాజరై తమ మద్దతును తెలియజేస్తున్నారు. ప్రచారం ఊరంతా పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. "మా గ్రామానికిదే కావాల్సిన నాయకత్వం" అని మహిళలు, యువత ఏకకంఠంతో ప్రకటిస్తున్నారు.

*** నిస్వార్థమైన సేవలను అందిస్తా...**

ప్రజలను ఆప్యాయంగా పలురిస్తూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ మీ సమస్యలే నా సమస్యలుగా భావించి నిరంతరం ప్రజా సేవ కొరకు కృషి చేస్తానని, అన్ని రంగాల వర్గాల వారికి అనుకూలంగా సేవలందిస్తానని, కుల మత జాతి విభేదాలు లేకుండా అందరిని సమాన దృక్పథంతో ప్రతి ఒక్కరిని ఆత్మగౌరవంతో సమాజ సేవకు ముందుకు వస్తానంటూ ఓటర్లను చెబుతున్నారు. మీరందరూ పెద్ద మనసు చేసుకొని సర్పంచ్ గా గెలిపిస్తే అనేక అభివృద్ధి పనులు చేయిస్తాననీ, రాజకీయంగా, ఆర్థికంగా, సమాజ సేవకు ముందుండి సేవ చేయడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిస్వార్థ రాజకీయాలకు తావు లేకుండా నిస్వార్థమైన సేవలను అందించడంలో ముందు ఉంటానని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని ప్రజలకు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి పథంలో నడిపిస్తా...

ప్రజలు అవకాశం ఇస్తే బిజిలీపూర్ ను అభివృద్ధి పథంలో నడిపించడం నా ప్రధాన లక్ష్యం. పారదర్శకత, సేవాభావం, గ్రామ గ్రామాభివృద్ధి.. ఈ మూడు అంశాలకే నా రాజకీయాలు పరిమితం" అని మహానంద ప్రచారంలో ప్రజలకు స్పష్టంగా హామీ ఇస్తున్నారు. విద్య, ఆరోగ్యం, నీటి సదుపాయాలు, రోడ్లు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా మహానందఅరవింద్ రాజకీయ రంగప్రవేశం గ్రామ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని, ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోంది.సర్పంచ్ పోటీలో ఆమె ప్రవేశం బిజిలిపూర్ లో ప్రతి ఇంటా చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఆశతో చూస్తున్న ఈ యువ నాయకురాలు గ్రామ భవిష్యత్తును ఎలా మలుస్తుందో అన్న ఆసక్తి రాజకీయ పరిణామాలను మరింత ఉత్కంఠగా మారుస్తోంది.

*** మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తా....**

అరగొండ మహానంద ప్రచారంలో భాగంగా తన మద్దతు దారులతో కలిసి ఇంటింట ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రజల నుండి పలు సమస్యలను అగిడి తెలుసుకుంటూ ఎన్నికల అనంతరం వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు.రోడ్ల నిర్మాణం, యువత అభివృద్ధి, మహిళ సాధికారత, విద్యా, ఆరోగ్య రంగాల్లో నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని , ముఖ్యంగా మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహా సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి దిశగా పయనించేలా పెద్ద ఎత్తున నిధులు కేటాయించేలా చూస్తానన్నారు. రింగు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అందరికీ అందుబాటులో ఉండి తనదైన శైలిలో అందరినీ కలుపుకొని పోయి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానంటూ భరోసా కల్పిస్తున్నారు.

## బీసీ ఉద్యమ అమరుడు సాయి ఈశ్వర్ చారి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఈటెల






జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : బీసీ ఉద్యమ అమరుడు సాయి ఈశ్వర్ చారి కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. బీసీ ఉద్యమానికి ముందడుగు వేసిన తొలి బీసీ ఉద్యమ అమరుడు సాయి ఈశ్వర్ చారి కుటుంబాన్ని సోమవారం ఆయనతో పాటు మేడ్చల్ అర్బన్ జిల్లా జనరల్ సెక్రెటరీ గిరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ లు పాల్గొని పరామర్శించారు. అనంతరం ఈటల రాజేందర్ సమక్షంలో ఆ కుటుంబానికి 25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా స్థాయి నాయకులు , సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్లు అందజేత



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ, శాంతి దివ్యంగుల సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి నగర్ లోని సంస్థ కార్యాలయంలో దివ్యాంగులకు చలికాలంలో వారికి ఉపయోగంగా ఉండేలా ఇరవై ఐదు మందికి దుప్పట్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధు బాబు చికిలే మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలంటే మంచి మనసు కావాలన్నారు. హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వారు అలాంటి మనసుతో పనిచేయడం అభినందనీయం అన్నారు. వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం దాత శ్రీకాంత్ కట్టె యాదవ్ కి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు భ్రమరాంబ, వంపు మల్లేష్ ,బాబురావు,శేఖర్ , దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్, పర్మిట్ రూం యాజమానులు నిబంధనలు పాటించాలి

*** ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: వైన్స్, పర్మిట్ రూం యాజమానులు నిబంధనలను తప్పకుండా పాటించాలని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ సూచించారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైన్స్, పర్మిట్ రూంలను ఎస్ఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైన్స్, పర్మిట్ రూం యాజమానులకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి ఎలాంటి గొడవలకు దిగిన కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వైన్స్, పర్మిట్ రూంల వద్ద వాహనాలను ఇష్టానురీతిగా రోడ్డుకు అడ్డంగా, వాహనాదారులకు ఇబ్బందులు కలిగేలా పార్కింగ్ చేస్తే వైన్స్, పర్మిట్ రూంల యాజమానులు, వాహనాల యాజమానులపై చర్యలుంటాయని హెచ్చరించారు. మద్యం మత్తులో ఎవరి పట్ల అయిన దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్ఐ తో హోమ్ గార్డ్ వెంకట్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థి నల్ల శంకర్ ని గెలిపించాలని ప్రచారం



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : చిన్నకందుకూరు గ్రామంలో ప్రచారం నిర్వహించిన గొంగిడి మహేందర్ రెడ్డి యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి నల్ల శంకర్ ని గెలిపించాలని ప్రచారం నిర్వహించిన మాజీ డిసిసిబి చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ అభ్యర్థిని, వార్డు సభ్యులను గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు..



## పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పంచాయతీ ఎన్నికల సంపూర్ణ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చండుగొండ మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్.ఓలు, ఏఈఓలతో సమావేశమై ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నియమ నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు నిర్వహిస్తున్న రికార్డులను విపులంగా పరిశీలించిన ఆయన, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు.పోలింగ్ సిబ్బంది నుండి పోస్టల్ బ్యాలెట్ జారీ చేసే సమయంలో ఫారం-17, డ్యూటీ ఆర్డర్ కాపీని తప్పనిసరిగా పరిశీలించాలని, పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సంతకం స్పష్టంగా ఉండాలని, అదే లేకపోతే ఆ ఓటు చెల్లదని స్పష్టం చేశారు.అదేవిధంగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సిన వసతులు, పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన భోజన ఏర్పాట్లు, రూట్‌వారిగా మెటీరియల్ పంపిణీ, రవాణా ప్రణాళికలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచి ఎంపిక, తిరిగి బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ సెంటర్‌కు పంపిణీ చేసే దశల్లో అత్యంత జాగ్రత్తలు, భద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఈ పరిస్థితిలో కలెక్టర్ వెంట ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సెయింట్ మేరీస్ స్కూల్‌లో సైబర్ క్రైమ్ అవగాహన

*** ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలి**

డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంచే ఉద్దేశ్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, వన్ టౌన్ సీఐ కరుణాకర్, ఎస్ఐ విజయ, మూడో టౌన్ సీఐ శివకుమార్ పాల్గొన్నారు.డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ ఓటీపీ, బ్యాంక్ పాస్‌వర్డ్‌ల పేరుతో జరిగే మోసాలు, సోషల్ మీడియా అకౌంట్ల హ్యాకింగ్, ఫేక్ జాబ్ ఆఫర్లు, గిఫ్ట్ స్కామ్‌లు, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయడం వల్ల జరిగే డేటా దొంగతనాలు, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వచ్చే మోసాలు, ఫేక్ ఇన్‌స్టాగ్రామ్/ఫేస్‌బుక్ ఐడీల ద్వారా వేధింపులు వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. చిన్న పొరపాటు కూడా పెద్ద నష్టానికి దారితీస్తుందని హెచ్చరించారు.

*** 1930 హెల్ప్‌లైన్ – బాధితులకు ప్రాణాధారం**

సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కి కాల్ చేస్తే, ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం

**బ్యాంకులు, అప్లికేషన్లు తక్షణ స్పందన**

ఫ్రాడ్ ట్రాన్సాక్షన్‌ను బ్లాక్ చేసే అవకాశం ఉంటుంది మోసం జరిగినట్లు తెలిసిన వెంటనే చర్యలు తీసుకుంటేనే డబ్బు రక్షించుకునే అవకాశం ఉంటుందని, మొదటి 10-15 నిమిషాలు అత్యంత కీలకమని తెలిపారు.అకౌంట్లకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి, గుర్తుతెలియని లింకులు, యాప్‌లు క్లిక్ చేయకూడదు, ఆన్‌లైన్‌లో అపరచితులను నమ్మకూడదు, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు ఎవరితోనూ షేర్ చేయరాదని సూచించారు. సమస్య ఎదురైతే వెంటనే గురువులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ రూబీ, అసిస్టెంట్ హెచ్‌ఎం సిస్టర్ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ముద్దేపాక దానమ్మ నర్సయ్య జోరుగా ప్రచారం




ఆలేరు, , ప్రజా స్ఫూర్తి : సాయి గూడెం సర్పంచ్ అభ్యర్థి ముద్దేపాక దానమ్మ నర్సయ్య గెలుపు కోరుతూ సోమవారం మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగడి సునీత మహేందర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ముద్దేపాక దానమ్మ నర్సయ్య బ్యాట్ గుర్తుకు ఓటు వేయాలని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ముద్దేపాక దానమ్మ నర్సయ్య ఓటర్లకు తెలిపారు. నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మొక్కను నాటిన ప్రకృతి ప్రేమికులు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కుత్బుల్లాపూర్ సీనియర్ జర్నలిస్ట్ రంగు వెంకటేష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రకృతి ప్రేమికులు, మన్‌కీ బాత్‌లో దేశ ప్రధాని మోడీచే ప్రశంసలందుకున్న సింగరేణియన్ కె.ఎన్.రాజ శేఖర్, ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువాతో కలిసి రామవరం హైస్కూల్లో పనస మొక్కను నాటి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు వారి వారి పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక తేదీల్లో మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చునని పిలుపునిచ్చారు.

## రెగ్యులరైస్ పనులను చేపట్టాలి

*** ప్రజావాణి లో అడిషనల్ కలెక్టర్ డి. విజేందర్ రెడ్డి కి వినతి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : 59 జీ.వో కు సంబంధించి ఇంటి రెగ్యులరైజ్ స్కీం లో ప్రభుత్వానికి ప్రజలు డబ్బులు చెల్లించిన సందర్భంగా తక్షణమే రెగ్యులరైస్ పనులను చేపట్టాలని సోమవారం స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మి నాథ్ ప్రజావాణి లో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ లో అడిషనల్ కలెక్టర్ డి. విజేందర్ రెడ్డి ని కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజిరెడ్డి, పర్వతాలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా వెలుస్తున్న హాస్టల్లపై చర్యలు తీసుకోవాలి

* భారతీయ జనతా పార్టీ బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్



కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కేపిహెచ్ బీ కాలనీలో విచ్చలవిడిగా వెలుస్తున్న హాస్టల్లపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ ప్రాంతంలో ప్రైవేట్ హాస్టల్ల ఏర్పాటును అడ్డుకోవాలని కోరారు. కాలనీలో ప్రైవేటు హాస్టల్లు రోజు రోజుకు పెరిగి పోతున్నాయని, ముఖ్యంగా అంబులెన్స్, క్యాబ్ మంచినీటి ట్యాంకర్ వంటి ఎమర్జెన్సీ సేవలకు సైతం తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని.. ధనార్జనే ధ్యేయంగా ఇంటి యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా, సరైన పార్కింగ్ సౌకర్యం లేకుండా ఇష్టా రీతిన హాస్టల్లను ఏర్పాటు పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, నాగలక్ష్మి, పద్మావతి, నాగేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, రాణి, వరప్రసాద్, సాయిశివరావు, భాస్కర్, శంకర్ రావు, నాయక్, శ్రీకృష్ణ, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డి నగర్ శ్రీ మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ దేవస్థాన కమిటీ నూతన అధ్యక్షుడిగా అల్లం రమేష్ యాదవ్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పాపిరెడ్డి నగర్‌లోని శ్రీ మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థాన కమిటీనూతన అధ్యక్షుడిగా అల్లం రమేష్ యాదవ్ ని నియమించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆకుల వెంకటస్వామి, ప్రధాన అర్చకులు ప్రకాశ్ రావు, వెంకటేశు, ప్రభాకర్ చైర్మన్, భూపాల్ రెడ్డి వైస్ చైర్మన్, రాజి రెడ్డి, పర్వతాలు యాదవ్, శ్రీహరి యాదవ్, మురళీకృష్ణ పటేల్, గోవర్ధన చారి, సాయికుమార్ పటేల్, మాజీ అధ్యక్షులు శ్రీధర్ పటేల్, బాలు యాదవ్, నర్సింగరావు పటేల్, శ్రీలత పటేల్, అజ్జు, శ్రీకాంత్ యాదవ్, రాజా మీసా, గుండ్లకొండ బాలు, కిరణ్, రాజేష్, సుధాకర్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అల్లం రమేష్ యాదవ్ దేవస్థాన అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## వికసిత్ భారత్... తెలంగాణ రైజింగ్ లక్ష్యాలు ఒకటే

దూరదృష్టి, సంకల్పంతో.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి నమూనాలు రూపొందించిందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. ప్రధాని మోదీ నినాదమైన వికసిత్ భారత్, సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించుకున్న తెలంగాణ రైజింగ్.. జాతీయ, రాష్ట్ర లక్ష్యాలను సూచిస్తున్నాయని తెలిపారు. ఈ సమిట్‌తో తెలంగాణ రైజింగ్ విజన్ ఆచరణలోకి వస్తుందన్నారు.గతం నుంచి నేర్చుకుని భవిష్యత్తు నిర్మించుకోవాలని.. దూరదృష్టితో కూడిన ఆలోచనల లక్ష్యాలు, వ్యూహాత్మక ప్రణాళికలను క్రమశిక్షణతో అమలుచేయాలని పిలుపునిచ్చారు.

# ఆన్ లైన్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను అధికారులు వెంటనే క్లియర్ చేయాలి

* మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ఆన్ లైన్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (114) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు.. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా సిఎంఓ ప్రజావాణి పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు

* ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్
* బెల్ట్ షాపులో తనిఖీలు, 9.745లీటర్ల మద్యం స్వాధీనం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బెల్ట్ షాపుల్లో ఎలాంటి మద్యం అమ్మకాలు జరిపిన చట్టపరంగా చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో గల బెల్ట్ షాప్‌లో మద్యం అమ్మకాలు జరుపుతుండగా ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్‌సోమవారం తనిఖీలు నిర్వహించారు. రూ.8048 విలువజేసే 9.745 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాప్ నిర్వహకుడు పిట్టల దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని, ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఎన్నికలు జరిగేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మద్యం, డబ్బు రవాణాపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్న, ప్రజలకు వీటి విషయంలో ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.ఎస్ఐ తో కానిస్టేబుల్ చంద్రశేఖర్,సంతోష్,గోపాల్ ఉన్నారు.



# రూ.1.11 కోట్ల విలువైన 223 కేజీల గంజాయి పట్టివేత

* నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అక్రమంగా తరలిస్తున్న రూ.1.11 కోట్ల విలువైన 223 కేజీల గంజాయిని భద్రాచలం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో కూనవరం రోడ్‌లోని వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కూనవరం నుంచి భద్రాచలం వైపు వస్తున్న అశోక్ లేల్యాండ్ వాహనాన్ని పోలీసులను చూసి వెనక్కు మళ్లించి పారిపోయే ప్రయత్నం చేయగా, పోలీసులు ఆ వాహనాన్ని పట్టుకుని తనిఖీ చేశారు. వాహనంలో 110ప్యాకెట్లలో రూ.1.11 కోట్ల విలువ చేసే 223 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు.మోతుగూడెంకు చెందిన కూరపాటి బుచ్చయ్య, కలుముల రమేష్, హైదరాబాద్‌కు చెందిన షేక్ షఫీవుద్దీన్, మహమ్మద్ మోసిన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ప్రీతంపాత్రో అనే వ్యక్తి సూచన మేరకు మోతుగూడెం సమీపంలోని సుకుమామిడి గ్రామం నుంచి 110 గంజాయి ప్యాకెట్లను కొబ్బరి పీచుల మధ్యలో పెట్టి బొలేరో వాహనంలో మహారాష్ట్రలోని సోలాపూర్ ప్రాంతానికి తరలిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్, సిబ్బంది, సీసీఎస్ టీం, సీఐ ఎం.నాగరాజులను జిల్లా ఎస్పీ, ఏఎస్పీలు అభినందించారు.

# ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో గల మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కారుణ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో సాధారణ సంప్రదింపులు, ఉచిత ఈసీజీ పరీక్ష , రక్తంలో చక్కెర పరీక్ష, ఉచిత బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తంగా లక్ష్మారెడ్డి ,కాలనీ అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాపరెడ్డి, సాహదేవ్, భీసు వెంకటేశం గౌడ్ లు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిక్చర్ రాములు, శ్రీధర్ గౌడ్, కృష్ణారెడ్డి, నరసింహ, ప్రవీణ్ కుమార్ గౌడ్, వెంకటేష్ ,మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు ప్రాకారం.. చేద్దాం కలల సాకారం!

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' కేవలం వివిధ ప్రభుత్వ విభాగాల అంకెల సమాహారం మాత్రమే కాదని.. భవిష్యత్తు కోసం, 2047 నాటికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలన్న లక్ష్య సాధనకు రూపకల్పన చేసిన కార్యక్రమమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తలపెట్టిన 'వికసిత్ భారత్' తరహాలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలకు అంకురార్పణ చేయడమే ఈ సదస్సు లక్ష్యమని వివరించారు. "నిన్నటివరకూ భారత్ ఫ్యూచర్ సిటీ లేదు.. ఇప్పుడది సాకారం అయింది. భవిష్యత్తుకు ఇది నిర్వచనం చెబుతుంది. భవిష్యత్తు కలలకు రూపకల్పన జరగబోయేది ఇక్కడే. వీటిని సాకారం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలి.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్.. తరలివస్తున్న ప్రముఖులు



రాష్ట్ర ఖ్యాతిని ఘనంగా చాటేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమిట్ ప్రారంభమైంది. అంతర్జాతీయ, ఆర్థిక సదస్సు కోసం దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు తరలివస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ సమిట్‌కు సంబంధించిన చిత్రాలు..











# అటు మంటల్లో నైట్‌క్లబ్.. ఇటు యజమానులు థాయ్‌లాండ్‌కు పరారీ!

గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదం కేసులో ప్రధాన నిందితులు, యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలు థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌కు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన చోటుచేసుకున్న గంటల వ్యవధిలోనే వారు దేశం విడిచి పారిపోయారని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అనంతరం గోవా పోలీసుల అభ్యర్థన మేరకు 'బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్' వారిపై లుక్ అవుట్ సర్క్యూలర్



జారీ చేసింది. ఈ ఇద్దరినీ వీలైనంత త్వరగా పట్టుకునేందుకు సీబీఐలోని ఇంటర్‌పోల్ విభాగంతో సమన్వయం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈనెల 6న రాత్రి 11.45 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకోగా.. నిందితులిద్దరూ 7న ఉదయం 5.30 గంటలకు ఓ విమానంలో ఫుకెట్‌కు పరారైనట్లు ముంబయిలోని 'బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్' గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నైట్‌క్లబ్‌కు చెందిన భరత్ కోహ్లీ అనే ఉద్యోగిని దిల్లీ నుంచి గోవాకు తీసుకొస్తున్నట్లు చెప్పారు. గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 25 మంది మృతి చెందారు. సిలిండర్ పేలుడుకు బాణసంచా తోడు కావడంతో తీవ్రత పెరిగింది. మృతుల్లో ఐదుగురు పర్యాటకులు, 20 మంది సిబ్బంది ఉన్నారు. మరో ఐదుగురు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# రేణుకా చౌదరిపై భాజపా ఎంపీల ప్రివిలేజ్ నోటీసు!

దిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు, ఎంపీ రేణుకా చౌదరి ఇటీవల పార్లమెంటు సముదాయంలోకి ఓ శునకాన్ని తీసుకొచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఘటనపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికార పార్టీ ఎంపీలు బ్రిజ్ లాల్, ఇందు బాలగోస్వామి



రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఆ ఎంపీలు ఇచ్చిన నోటీసును పరిశీలించాలని రాజ్యసభ ఛైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. రేణుకా వ్యవహారంపై ప్రివిలేజ్ కమిటీ విచారణ జరిపి ఛైర్మన్‌కి సిఫారసు చేయనుంది. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజు ఓ శునకాన్ని తన కారులో తీసుకొచ్చిన రేణుకా చౌదరి.. ఆ సమయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే.

# 'కచ్చితమైన కారణాలను ఇప్పుడే చెప్పలేం'.. DGCA షోకాజ్ నోటీసుపై ఇండిగో

విమాన సర్వీసుల అంతరాయంపై వివరణ ఇవ్వాల్సిందిగా DGCA జారీ చేసిన షోకాజ్ నోటీసుకు విమానయాన సంస్థ ఇండిగో స్పందించింది. తాము చేసిన పొరపాటుకు క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపింది. ఈ మొత్తం గందరగోళానికి గల కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు మరికొంత సమయం కావాలని కోరింది. ప్రస్తుతానికి కొన్ని ప్రాథమిక కారణాలను DGCA ముందుంచింది. సీఈవో, సీఓఓ సంతకాలతో కూడిన ఈ వివరణను సోమవారం సమర్పించింది. ప్రయాణికులకు కలిగిన ఇబ్బందికి 'మనస్ఫూర్తిగా క్షమాపణలు' చెబుతున్నట్లు ఇండిగో తెలిపింది. అనేక అనూహ్య అంశాలు ప్రభావం చూపడం వల్లే ఈ ఆటంకం




ఏర్పడిందని పేర్కొంది. పరిస్థితి సంక్లిష్టత, తమ కార్యకలాపాల విస్తృతి దృష్ట్యా ఇప్పుడే 'కచ్చితమైన కారణాలను' స్పష్టంగా చెప్పడం సాధ్యం కాదని తెలిపింది. పూర్తి స్థాయి 'మూల కారణాన్ని విశ్లేషించేందుకు' తమకు మరింత గడువు కావాలని అడిగింది. DGCA మాన్యువల్‌లో షోకాజ్ నోటీసుకు 15 రోజుల గడువు ఉందని గుర్తు చేసింది. RCA పూర్తయిన వెంటనే పూర్తి వివరాలను అందిస్తామని చెప్పింది. ఈ అవాంతరాలకు ప్రధానంగా ఐదు అంశాలు కారణమని ఇండిగో ప్రాథమికంగా వెల్లడించింది. స్వల్ప సాంకేతిక లోపాలు, విమానాల షెడ్యూళ్లను మార్చడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ దీనికి కారణం అని తెలిపింది. కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ ఫేజ్ II' రోస్టరింగ్ నియమాలు కూడా ఒక కారణంగా పేర్కొంది. ఈ FDTL అమల్లో ఉన్న సవాళ్లపై తాము ఇప్పటికే DGCAతో చర్చిస్తున్నామని నిబంధనల నుంచి మినహాయింపు లేదా గడువు పొడిగింపు కోసం చూస్తున్నామని తెలిపింది. ఈ కారణాలన్నీ కలిసి డిసెంబర్ నెల ప్రారంభంలో తమ విమానాల 'ఆన్‌టైమ్ నెట్‌వర్క్ పనితీరు'ను తగ్గించాయని ఇండిగో పేర్కొంది. దీంతో నెట్‌వర్క్‌ను పునరుద్ధరించడానికి, చిక్కుకుపోయిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడానికి, విమానాశ్రయాల్లో రద్దీని తగ్గించడానికి 'నెట్‌వర్క్ రీబూట్' అనే కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినట్లు వివరించింది. దీంతో గణనీయ సంఖ్యలో విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొంది.

# నవజోత్ కౌర్ సిద్ధూపై కాంగ్రెస్ సస్పెన్షన్ వేటు

చండీగఢ్: పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నవజోత్ సింగ్ సిద్ధూ సతీమణి నవజోత్ కౌర్ సిద్ధూను ఆ పార్టీ సస్పెండ్ చేసింది. ముఖ్యమంత్రి పీఠం కోసం రూ.500 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందంటూ ఇటీవల ఆమె సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా తాజాగా ఆమెపై చర్యలు తీసుకున్నారు. తన భర్త నవజోత్ సింగ్ సిద్ధూ క్రియాశీలక రాజకీయాల్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని కౌర్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. కానీ, బేషరతుగా ఆయన్ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు.



తామెప్పుడూ పంజాబ్ ప్రయోజనాల కోసమే పోరాడతామన్నారు. కానీ, సీఎం సీటులో కూర్చోవడానికి ఇవ్వాల్సిన రూ.500 కోట్లు తమ వద్ద లేవంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'అదేం లేదని' బదులిచ్చారు. కానీ, రూ.500 కోట్లు ఇచ్చినవాళ్లే సీఎం అవుతారంటూ మళ్లీ అనడంతో పార్టీలో తీవ్ర వివాదం చెలరేగింది. ఈ వివాదం ముదరటంతో తన వ్యాఖ్యల్ని వక్రీకరించారని కౌర్ వివరణ ఇచ్చారు. ఇంకే పార్టీ నుంచైనా సిద్ధూ సీఎం అవుతారా? అన్న విలేకరుల ప్రశ్నకు 'మా దగ్గర ఇవ్వడానికి డబ్బులు లేవు' అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు.

# 15 ఏళ్ల క్రితం అదృశ్యం.. వైరల్ వీడియోతో మళ్లీ కుటుంబం చెంతకు!

హమీర్‌పుర్: సరిహద్దు రహదారుల సంస్థకు చెందిన 'జీఆర్ఈఎఫ్'లో ఉద్యోగం సాధించిన ఓ యువకుడు.. అందులో చేరకుండానే మార్గమధ్యంలో అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఇది జరిగిన దాదాపు 15 ఏళ్ల అనంతరం ఓ ఫేస్‌బుక్ వీడియోలో అతడు ప్రత్యక్షమయ్యాడు. అతణ్ని గుర్తించి, తిరిగి స్వస్థలానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పుర్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్థోలీ గ్రామానికి చెందిన బల్దేవ్‌కు జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్‌లో ఉద్యోగం వచ్చింది. త్రిపురలో పోస్టింగ్ కావడంతో అక్కడికి బయల్దేరాడు. మార్గమధ్యంలో దిల్లీలో అదృశ్యమయ్యాడు. జ్ఞాపకశక్తి దెబ్బతినడంతో అటు ఉద్యోగంలో చేరలేదు.. ఇటు ఇంటికీ రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఎట్టకేలకు 15 ఏళ్ల తర్వాత ఓ సోషల్ మీడియా వీడియో అతణ్ని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చింది. ''అదృశ్యమైన సమయంలో బల్దేవ్ తన



జ్ఞాపకశక్తి కోల్పోయాడు. హరియాణాలోని హిసార్‌కు చేరుకుని అక్కడే ఓ పశువుల కొట్టంలో తొమ్మిదేళ్లు ఉన్నాడు. కొవిడ్ సమయంలో అక్కడినుంచి పంపించేశారు. ఆ తర్వాత బికనేర్‌కు చెందిన ఓ రాజస్థానీ కుటుంబం తమతోపాటు తీసుకెళ్లింది. అతడు తరచూ తన ఇల్లు హమీర్‌పుర్‌లో ఉందని, కొన్నిసార్లు ఊనాలో ఉందని చెప్పేవాడు. దీంతో ఆ కుటుంబం ఇదంతా వీడియో తీసి ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసింది'' అని బల్దేవ్ సోదరుడు మీడియాకు వెల్లడించాడు. ఆ వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అది చూసిన బల్దేవ్ బంధువు ఒకరు అతణ్ని గుర్తుపట్టారు. కుటుంబ సభ్యులకు చెప్పడంతో.. వారంతా కలిసి రాజస్థాన్‌కు వెళ్లి, వెనక్కి తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కెప్టెన్ రంజిత్ సింగ్, అధికారులు, గ్రామస్థులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. బల్దేవ్ జ్ఞాపకశక్తి బలహీనంగా ఉందని, అందుకే కొంతమందినే గుర్తుపడుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇన్నేళ్లు అతణ్ని సంరక్షించిన రాజస్థానీ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వందేమాతరం వలే నెహ్రూపై చర్చ పెడదాం ప్రియాంకాగాంధీ ఈ సలహా ఎందుకిచ్చారంటే..?

వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై జరుగుతోన్న చర్చలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిపెట్టుకొని ఈ చర్చకు తెరతీశారని ఆమె విమర్శించారు. ''వందేమాతరం భారత ప్రజల మనసుల్లో మమేకమై ఉంది. ఇది మన జాతీయ గేయం. ఇప్పుడు మనం దీని గురించి ఎందుకు చర్చించుకుంటున్నాం..? ప్రజా సమస్యల నుంచి దేశాన్ని పక్కదారి పట్టించేందుకు, బెంగాల్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ చర్చను సిద్ధం చేశారు. ప్రజలు వర్తమానం, భవిష్యత్తును వదిలి, గతంలోకి చూడాలని ఈ ప్రభుత్వం కోరుకుంటోంది. ఈ దేశ ప్రజలు సంతోషంగా లేరు. వారిని ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయి. కానీ ప్రభుత్వం వాటిని పరిష్కరించే దిశగా చర్చ జరపడం లేదు'' అని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆమె వ్యాఖ్యలకు వ్యతిరేకంగా అధికారపక్ష సభ్యులు నినాదాలు



చేశారు. అధికారపక్ష సభ్యులకు ప్రియాంక ఒక సలహా ఇచ్చారు. ''మీరు నెహ్రూ గురించి మాట్లాడుతూనే ఉన్నారు. కాబట్టి మనం ఒక పనిచేద్దాం. అందుకోసం సమయం కేటాయించుకుందాం. ఆయన గురించి మీరు మాట్లాడాలనుకున్న అంశాలన్నీ ఒక జాబితా చేద్దాం. వాటిపై చర్చిద్దాం. ఇక ఛాప్టర్‌ను అక్కడితో ముగిద్దాం. ప్రజా సమస్యలు గురించి కాకుండా.. ఇప్పుడు మనం వందేమాతరం గురించి చర్చిస్తున్నట్టుగా నెహ్రూ గురించి చర్చించుకుందాం'' అని సూచించారు.

# చైనా ప్రయాణాల విషయంలో జాగ్రత్త..!: భారత విదేశాంగశాఖ

చైనాకు ప్రయాణిస్తున్నప్పుడు, లేదా ఆ దేశం మీదుగా రాకపోకలు సాగించే సమయంలో భారత పౌరులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విదేశాంగశాఖ సూచించింది. బీజింగ్ సైతం భారత ప్రయాణికుల విషయంలో సక్రమంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ అంశంపై చైనాలోని షాంఘై విమానాశ్రయంలో ఇటీవల ఓ భారత మహిళకు వేధింపులు ఎదురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా సూచనలు జారీ చేసింది. ''చైనా విమానాశ్రయాల మీదుగా రాకపోకలు సాగించే భారతీయులను లక్ష్యంగా చేసుకోబోమని చైనా హామీ ఇస్తుందని ఆశిస్తున్నాం.



ఏకపక్షంగా నిర్బంధించడం, వేధించడం వంటి పనులను మానుకుంటుందని, అదేవిధంగా అంతర్జాతీయ విమాన ప్రయాణ నిబంధనలను గౌరవిస్తుందని భావిస్తున్నాం. చైనా ప్రయాణాల విషయంలో భారతీయులు జాగ్రత్తగా వ్యవహరించాలి'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ తెలిపారు.

**ఏం జరిగిందంటే..**

గత నెలలో పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనాలోని షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ చూసి.. తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించినట్లు ఆరోపించారు. స్థానిక భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సాయం అందిందని సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ ఘటనను భారత్ ఇప్పటికే తీవ్రంగా ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్ ముమ్మాటికీ భారత్‌లో భాగమేనని, అక్కడి నివాసితులు భారత పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండేందుకు, ప్రయాణించేందుకు పూర్తిగా అర్హులని పేర్కొంది. మరోవైపు.. ఆమెకు ఎలాంటి వేధింపులు, నిర్బంధ చర్యలు ఎదురుకాలేదని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పడం గమనార్హం. అక్కడితో ఆగకుండా.. జాంగ్నాన్ (అరుణాచల్‌కు చైనా పేరు) ఎల్లప్పుడూ తమ భూభాగమేనని నోరుపారేసుకున్నారు.

# సీఎం మార్పు ఊహాగానాల వేళ.. సీఎం సిద్ధూకు సుప్రీంకోర్టు నోటీసులు

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె.శంకర అనే వ్యక్తి అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనికి సమాధానం ఇవ్వాలని సీఎంను కోర్టు ఆదేశించింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధూ అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. హైకోర్టు ఉత్తర్వులను పిటిషనర్ సుప్రీంలో సవాల్ చేయగా.. ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఒకవైపు కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు తీవ్ర స్థాయిలో చక్కర్లు కొడుతున్నాయి. సిద్ధూ స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పీఠం మీద కూర్చుంటారనే వార్తలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలోనే సిద్ధూకు నోటీసులు వచ్చాయి. మరోవైపు ఇప్పటికే నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు జారీ చేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ వివరణ కోరుతూ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 19లోపు వివరాలు సమర్పించాలని ఈవోడబ్ల్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై దిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే.



# దిష్టి రాజకీయం..! పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి నాదెండ్ల మనోహర్

కోనసీమకు దిష్టి తగిలిందన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. సోమవారం మీడియా అడిగిన పశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించారని స్పష్టం చేశారు. వక్రీకరించడం, అనవసరంగా రాద్ధాంతం చేశారని అన్నారు. రైతులతో మాట్లాడిన సందర్భంలో మాత్రమే ఆయన అన్నారని, అంతే కానీ పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు రాజకీయం చేయాల్సిన అంశం కాదన్నారు. పవన్ కల్యాణ్ దురుద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేయలేదన్నారు. తెలంగాణ ప్రజలపై పవన్ కల్యాణ్ కు నమ్మకం, ప్రేమ ఉందని తెలిపారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు రాజకీయం చేయాల్సిన అంశం కాదని మరోసారి మంత్రి నాదెండ్ల మనోహర్ నొక్కి చెప్పారు. కాగా, గత నెల 26 వ తేదీన పవన్ కల్యాణ్



ఆంధ్రప్రదేశ్ లోని బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ లోంచి వస్తున్న సముద్రపు జలాల కారణంగా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించి బాధిత రైతులతో ముఖాముఖీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గోదావరి జలాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం గోదావరి జిల్లాల పచ్చదనమే. ఆ శాపం తగిలినట్టుంది. కోనసీమ కొబ్బరి చెట్లతో పచ్చగా ఉంటుందని, తెలంగాణ నాయకులంతా అంటారు. నరదిష్టికి నల్ల రాయి కూడా పగిలిపోతుంది అంటారు. ఇప్పుడు కొబ్బరి చెట్ల మొండేలు కూడా లేవు. అంత దిష్టి తగిలింది కోనసీమకు అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను తెలంగాణలో పలువురు నేతలు, మంత్రులు తీవ్రంగా ఖండించారు.



## సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు నిందితుడు కొమ్మ కోట్లకు రిమాండ్

విజయవాడ: దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో లొంగిపోయిన నిందితుడు కొమ్మా కోటేశ్వరరావు ఎలియాస్ కొమ్మా కోట్లుకు ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించే కోర్టు ఈనెల 15 వరకు రిమాండ్ విధించింది. నిందితుడిని నెల్లూరు జైలుకు తరలించాలని ఆదేశించింది. గత కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న కొమ్మా కోట్లు ఈ రోజు విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన విషయం తెలిసిందే. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తరలించడం, అక్కడినుంచి విజయవాడకు తీసుకురావడంలో కొమ్మా కోట్లు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ కేసును ఉపసంహరించుకోవాలంటూ సత్యవర్ధన్‌పై వంశీ అనుచరులు తీవ్రంగా ఒత్తిడి తెచ్చి కిడ్నాప్ చేయడంతో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ1గా వల్లభనేని వంశీ, ఏ2గా కొమ్మా కోట్లు ఉన్నారు.



## గంగవరం పోర్టు గేటు వద్ద మత్స్యకారుల ధర్నా..
## చర్చలకు పిలిచిన యాజమాన్యం

విశాఖ: గంగవరం పోర్టు గేటు వద్ద నిర్వాసిత మత్స్యకారులు ఆందోళనకు దిగారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద తమకు ఒక్కొక్కరికి చెల్లించాల్సిన రూ.2 లక్షల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఇది ఉద్రిక్తతకు దారి తీసింది. గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. గంగవరం పోర్టులోని 499 మంది కార్మికులకు ఒక్కొక్కరికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఏడాది క్రితం యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. వీటి చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నారని, పన్నుల రూపంలో డబ్బులు అయిపోయాయని అధికారులు సాకులు చెబుతున్నారని ఆరోపిస్తూ కార్మికులు కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం కార్మికులంతా మూకుమ్మడిగా గేటు వద్దకు వచ్చారు. దీంతో యాజమాన్యం స్పందించి కార్మిక నాయకులను చర్చలకు పిలిచింది. వివిధ అంశాలపై వారితో అధికారులు చర్చిస్తున్నారు.

## నకిలీ మద్యం కేసులో నిందితులకు కస్టడీ

నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను కస్టడీకి అప్పగిస్తూ విజయవాడ కోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అబ్కారీ శాఖ అధికారులు నిందితులను పది రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించింది. దానిపై విచారించిన న్యాయస్థానం ఇందుకు పాక్షికంగా అంగీకరించింది. కోర్టు ఆదేశాల ప్రకారం నిందితులైన కట్టా రాజు, సయ్యద్ హాజీ, అంథాదాస్, మిథున్ దాస్ లను డిసెంబర్ 11 నుంచి డిసెంబర్ 15 వరకు ఐదు రోజుల పాటు ఎక్సైజ్ శాఖ కస్టడీలోకి



తీసుకోనుంది. ఈ వ్యవధిలో నిందితుల నుంచి నకిలీ మద్యం తయారీ, పంపిణీకి సంబంధించిన కీలక సమాచారాన్ని రాబట్టడానికి దర్యాప్తు అధికారులు ప్రయత్నించనున్నారు. ఈ నకిలీ మద్యం కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అన్నమయ్య జిల్లా ములకలచెరువుతో పాటు ఇతర ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం సిట్ ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు కీలక వ్యక్తులను అరెస్టు చేయడం జరిగింది. మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాముపైనా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ ఇటీవల కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయం విదితమే. తాజాగా మరో నలుగురు నిందితుల కస్టడీ ద్వారా లభించే సమాచారం మేరకు కేసు దర్యాప్తులో మరింత ముందుకు వెళ్లడానికి అవకాశం ఏర్పడనుంది. ఈ దందా వెనుక ఉన్న పూర్తిస్థాయి నెట్‌వర్క్‌ను ఛేదించడానికి అధికారులకు ఈ అవకాశం దోహదపడనుందని తెలుస్తోంది.

# విద్యార్థినికి న్యాయం చేస్తాం.. ఎవరినీ వదిలిపెట్టం

: **హోంమంత్రి వంగలపూడి అనిత**

తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థినిపై ఇద్దరు ప్రొఫెసర్లు లైంగిక దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. బాధితురాలు గర్భం దాల్చగా బెదిరించి ఆమెను సొంత రాష్ట్రానికి పంపించారు. ఇంఛార్జ్ వీసీ రజనీకాంత్ ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను తిరుపతి వెస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. అదేవిధంగా కేసులో పూర్తి ఆధారాలను రికవరీ చేసేందుకు ఇద్దరి సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ నేపథ్యంలోనే



హోంమంత్రి వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధిత విద్యార్థినికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిందితులను ఉపేక్షించేది లేదన్నారు. తిరుపతి ఎస్పీ, పోలీసు, ఉన్నతాధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నానని అన్నారు. ఈ కేసును తిరుపతి ఎస్పీ వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని, పూర్తి స్థాయి విచారణ కోసం ఒడిశాకు పోలీసుల బృందం వెళ్లిందన్నారు. విద్యార్థినికి న్యాయం చేస్తామని.. మహిళల రక్షణే తమ ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి అనిత అన్నారు.

## పరకామణిలో చోరీ చిన్నదేనని అనడం అవమానించడమే

పరకామణి చోరీ చిన్నదేనని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అనడం అవమానించడమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. చిన్నపాటి చోరీకి శిక్ష వేస్తారా అని జగన్ ప్రశ్నించడంపై అసహనం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని దమ్మయ్యపర్తి మురుగు కాలువపై నూతనంగా నిర్మిస్తున్న గోడ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడూతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసు విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు శ్రీవారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని





మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చిన్నపాటి చోరీకి శిక్ష వేస్తారా? అని జగన్ ప్రశ్నించడం భక్తులను, టీటీడీనీ అవమానించడమే అని మండిపడ్డారు. దొంగతనం అనేది చిన్నదైనా, పెద్దదైనా నేరమేనని, అదీ కలియుగ దైవం శ్రీవారి హుండీ కానుకలను దొంగిలించడం మహాఘోరమని ఆయన అన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని వెనకేసుకురావడమే కాకుండా, దాతగా చిత్రీకరించే ప్రయత్నం మాజీ ముఖ్యమంత్రి చేయడంలో ఆంతర్యం ఏమిటని మంత్రి నిమ్మల ప్రశ్నించారు. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పరకామణిలో జరిగిన ఈ చోరీ కేసులో నిందితుడు రవికుమార్ నుంచి సుమారు రూ. 14 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి విరాళంగా రాయించుకుని లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ విచారణ జరిపింది. కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న ఏవీఎస్వో సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఈ కేసు తీవ్రతను మరింత పెంచింది. శ్రీవారి ఆలయ పవిత్రతకు భంగం కలిగించే ఈ సంఘటనను మాజీ సీఎం సమర్థించడం.. అక్రమాలకు, అవినీతికి లైసెన్స్ ఇచ్చినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కేసు రాజీపై ప్రస్తుత టీటీడీ బోర్డు కూడా కొత్త క్రిమినల్ కేసు నమోదు చేయాలని నిర్ణయించింది.

## అమ్మేది లేదంటూనే అదానీ చేతిలో పెడుతున్నారు

: **వైయస్ షర్మిల**

విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేది లేదని చెబుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్లాంట్ ను మెల్లగా అదానీ చేతిలో పెడుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆరోపించారు. ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శల వర్షాన్ని గుప్పించారు. విశాఖపట్నం స్టీట్ ప్లాంట్ విషయంలో బిజెపి రెండు నాల్కల ధోరణి అవలంబిస్తోందని షర్మిల అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని ఒకవైపు చెబుతోంది.. ప్లాంట్ ను ఎట్టి పరిస్థితుల్లో అమ్మేది లేదని అంటోందని.. విశాఖ ఉక్కు సంస్థను ఆదుకుంటామని చెబుతోందని అన్నారు. కానీ మరో వైపు చాపకింద నీరులా ప్రైవేటీకరణ వైపు పావులు కదుపుతూ అదానీ చేతిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి, కార్మికుల ఆగ్రహాన్ని చల్లబరచడానికి కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు. తెర ముందు గొప్పగా మాటలు మాట్లాడుతూ తెర వెనుక అదానీ చేతిలో ప్లాంట్ ను పెట్టేందుకు స్కెచ్చులు వేస్తున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రి సైలెంట్ కిల్లింగ్ విధానాన్ని అవలంబిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ లోని ఉద్యోగులను ఒక్కొక్కరిగా తప్పిస్తున్నారని విమర్శించారు. కొత్త నియామకాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అడ్డికి పావుసేరు లెక్కన ప్లాంట్ భూములను అదానీకి ధారాదత్తం చేయ చూస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కుకు ఉరి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని వనరులను ఒక్కొక్కటిగా అదానీకి అప్పగిస్తూ రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్ గా మార్చాలని చూస్తున్నారంటూ విమర్శనాస్త్రాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఎక్కుపెట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మే కుట్రలో కూటమి పార్టీల నేతలు క్రియాశీలురైతే ప్రధానమంత్రి అందుకు కర్త అని ఆరోపణలను గుప్పించారు. ఒక చేత్తో సాయం చేస్తున్నట్లు నటిస్తూ మరో చేత్తో గుంజుకుంటున్నారని అన్నారు. పొమ్మనలేక పొగబెట్టుతున్న చందాన నష్టాల సాకు చూపి ఉద్యోగులను వేధిస్తున్నారని వైయస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికొద్ది జీతమని ప్రపంచంలో లేని రూల్స్ ను పెడుతున్నారన్నారు. టెండర్ల పేరుతో ముక్కలుగా కోసి విడిభాగాలుగా అమ్మకానికి పెట్టి, ప్రతి అడుగూ ఆదానీకి దగ్గర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకులను ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని.. ఇంత చేస్తూ స్టీల్ ప్లాంట్ పై చిత్తశుద్ధి ఉందని గొప్పలు చెప్పడానికి



బీజేపీకి ఏ మాత్రం మొహమాటం లేకుండా పోయిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ వేదికగా ప్రధానమంత్రి ప్రకటన చేయాలన్నారు. తెలుగువారి ఆత్మగౌరవంపై గౌరవం ఉంటే అదానీకి కట్టబెట్టే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ను ఎస్ఏఐఎల్ లో విలీనం చేస్తున్నట్లు హామీనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రకటన చేయించాలని పిలుపునిచ్చారు.

## పల్నాడు రోడ్డు ప్రమాద ఘటనలో మరో బిగ్ ట్విస్ట్..

పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద మూడు రోజుల క్రితం జరిగిన భయానక రోడ్డు ప్రమాదం మరో సంచలన మలుపు తిరిగింది. ఈ ఘటనలో ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు స్పాట్‌లోనే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. మృతి చెందిన వారంతా మాలలోకి చెందినవారే కావడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని రేకెత్తించింది. తాజాగా పోలీసులు నిర్వహించిన దర్యాప్తులో షాకింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ రహదారిపై కంటైనర్ లారీని ఒక కారు అడ్డుపెట్టి ఆపే ప్రయత్నం చేసినట్లు విచారణలో బయట



పడింది. అదే సమయంలో వెనుక నుండి వస్తున్న విద్యార్థుల కారు ఆ కంటైనర్‌ను ఢీకొనడంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. కంటైనర్‌కు అడ్డుపెట్టిన కారులో ఉన్న వ్యక్తి ఓ ఏఎస్ఐ కుమారుడు అని, అతడు తన గ్యాంగ్‌తో కలిసి బ్రేక్ ఇన్స్‌పెక్టర్‌లా వ్యవహరిస్తూ హైవేపై అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. కంటైనర్‌ను పక్కకు ఆపించాలని అతడు సైగ చేయడంతో లారీ వేగం తగ్గించగా, వెనుక నుంచి వచ్చిన విద్యార్థుల కారు అదుపు తప్పి భయంకరంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు కారణమైన ఏఎస్ఐ కుమారుడిని చిలకలూరిపేట పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణను వేగవంతం చేశారు. ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ విడుదల చేశారు.

## పాత 50 పైసల నాణేలు ఇంకా చెల్లుతాయి..
## వాట్సాప్‌లో ఆర్బీఐ కీలక మెసేజ్‌లు!




**న్యూఢిల్లీ:** పది రూపాయల నాణేలు చెల్లవని చాలా రోజులుగా ఓ ప్రచారం జరుగుతోంది. ఇది నమ్మి కొంతమంది వ్యాపారులు, దుకాణదారులు నాణేలను స్వీకరించడం లేదు. రూ.10 నాణేలు చెల్లుతాయని గతంలోనే పలుమార్లు ఆర్బీఐ క్లారిటీ ఇచ్చినప్పటికీ అదే అపోహ కొనసాగుతోంది. దీంతో నాణేల చెల్లుబాటుపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి, అవగాహన కలగించేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా నాణేల చెల్లుబాటుపై సోమవారం నాడు ప్రజలకు వాట్సాప్‌లో పర్సనల్ మెసేజ్‌లు పంపించింది. నాణేల చెల్లుబాటుపై అవగాహన కల్పించేలా ఒక వీడియోను కూడా షేర్ చేసింది. వాట్సాప్‌లో ఆర్బీఐ పంపిన సందేశం మేరకు.. నాణేలు వేర్వేరు డిజైన్లతో ఉన్నప్పటికీ అవన్నీ చలామణీలో ఉన్నాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. 50 పైసలు మొదలుకొని రూ.1, 2, 5, 10, 20 నాణేలు అన్నీ చట్టబద్ధమైనవేనని.. అవన్నీ సుదీర్ఘకాలం చలామణీలో ఉంటాయని తెలిపింది. నాణేల గురించి తప్పుదారి పట్టించే సమాచారాన్ని, పుకార్లను నమ్మవద్దని సూచించింది. ఎలాంటి సందేహం లేకుండా నాణేలను స్వీకరించాలని కోరింది. వ్యాపారులు కూడా సంకోచం లేకుండా ప్రజల నుంచి నాణేలను స్వీకరించాలని విజ్ఞప్తి చేసింది.

## గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్..
### ఎంసీఎక్స్‌లో తులం రూ.1.30లక్షలు దాటిన బంగారం..!



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ బలంగా ఉండడంతో బంగారం తులం ధర రూ.1,30,638 చేరింది. వెండి ఫ్యూచర్స్ కిలోకు రూ.1,82,600కి పడిపోయింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి పాలసీ సమావేశం జరుగనున్నది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవరించారు. దాంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఫిబ్రవరి 2026 కాంట్రాక్టుకు సంబంధించి గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు 0.13 శాతం పెరిగి రూ.1,30,638కి చేరుకుంది. అయితే, సిలర్వ్ ఫ్యూచర్స్ 0.44 శాతం తగ్గి కిలోకు రూ.1,82,600కి చేరాయి.

శుక్రవారం ఎంసీఎక్స్‌లో సిల్వర్ రూ.7,096 పెరిగి రికార్డు స్థాయిలో రూ.1,85,234 మార్క్‌ను చేరుకుంది. చివరికు కిలోకు రూ.1,83,408 వద్ద ముగిసింది. గతవారంలో వెండి భారీగా 4.81శాతం వరకు పెరిగి.. 3శాతానికిపైగా లాభపడ్డాయి. తాజాగా ప్రారంభంలో కొంత లాభాల స్వీకరణకు చూసిందని.. కానీ, లండన్, చైనాలో తగ్గుతున్న నిల్వలు, 2026 వరకు నిర్మాణాత్మక లోటు కొనసాగుతుందన్న ఆందోళన మధ్య స్థిరంగా ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ విశ్లేషకుడు మానవ్ మోదీ తెలిపారు.

బలమైన పారిశ్రామిక డిమాండ్, సురక్షిత స్వర్గధామ పెట్టుబడికావడంతో కొనసాగుతున్న పెట్టుబడులు ఈటీఎఫ్‌లో వెండిని బలోపేతం చేశాయన్నారు. ఇక ఏడాది చివరి పాలసీ సమావేశానికి ముందు ఫెడ్ రిజర్వ్ రేట్లను సడలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారని.. దాంతో మార్కెట్ పెరుగుతుందని మోదీ తెలిపారు. ఈ వారం పెట్టుబడిదారుల దృష్టి ఫెడ్ తుది సమావేశంపై మాత్రమే కాకుండా, యూఎస్ ఫ్యాక్టరీ ఆర్డర్లు, ఇతర కీలకమైన స్థూల ఆర్థిక డేటాపై ఉంటుందని చెప్పారు.

ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం వరకు వ్యాపారులు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉందన్నారు. ఎందుకంటే ఫెడ్ వైఖరిలో ఏదైనా మార్పులు బులియన్ ధరల్లో అస్థిరతకు దారి తీసే అవకాశం ఉందన్నారు. రిలయన్స్ సెక్యూరిటీస్‌లో సీనియర్ పరిశోధన విశ్లేషకుడు జిగర్ త్రివేది మాట్లాడుతూ.. బంగారం ధరలు ఔన్సుకు 4,200 డాలర్లకు చేరుకున్నాయి. ఫెడ్ చివరి సమావేశంలో 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం 88శాతం వరకు ఉందని త్రివేది తెలిపారు.

వచ్చే ఏడాది సైతం మరిన్ని వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి. కామెక్స్‌లో ఫిబ్రవరి డెలివరీకి సంబంధించి గోల్డ్ ఫ్యూచర్లు ఔన్సుకు 4,244.2 డాలర్ల వద్ద స్థిరంగా ట్రేడవుతున్నది. మార్చి 2026 కాంట్రాక్టుకు సంబంధించిన కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ 0.54 శాతం తగ్గి ఔన్సుకు 58.73 డాలర్ల వద్దకు చేరింది. శుక్రవారం సిల్వర్ 4.19శాతం పెరిగి ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి ఔన్స్‌కు 59.90 డాలర్లకు పెరిగింది.

## యూఎస్ ఫెడ్ భయాలు...
### కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
### భారీ నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు
### 609 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్, 225 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలను చవిచూశాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయంపై ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) అమ్మకాలు కొనసాగించడంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. దీంతో సూచీలు భారీగా పతనమయ్యాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 609.68 పాయింట్లు నష్టపోయి 85,102.69 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 84,875.59 కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 225.90 పాయింట్లు క్షీణించి 25,960.55 వద్ద ముగిసింది.

"ఈ వారం యూఎస్ ఫెడ్ పాలసీ నిర్ణయం ఉండటంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దేశీయ వృద్ధి గణాంకాలు బలంగా ఉన్నప్పటికీ, ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా.. అంతర్జాతీయ ద్రవ్య విధాన ఆందోళనలు, ఎడతెరిపిలేని ఎఫ్ఐఐల అమ్మకాలు, రూపాయి బలహీనత వంటివి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. జపాన్ బాండ్ల అంశం కూడా ఆందోళనను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు.

సెన్సెక్స్-30 షేర్లలో టెక్ మహీంద్రా మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ముగిశాయి. టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టైటాన్, ఎన్‌టీపీసీ, కోటక్ బ్యాంక్ వంటివి ప్రధానంగా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంక్, ఆటో, ఎఫ్ఎంసీజీ, ఐటీ సూచీలన్నీ పతనమయ్యాయి. బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.83 శాతం మేర పడిపోయాయి.

## భారత క్రికెటర్లకు
# షాకిచ్చిన ఐసీసీ..



### మ్యాచ్ ఫీజులో భారీ కోత..!

**న్యూఢిల్లీ:** విశాఖ వన్డేలో అదిరే విజయంతో సిరీస్ గెలుపొందిన టీమిండియా భారీ షాక్. స్లో ఓవర్ రేటు కారణంగా భారత జట్టుపై అంతర్జాతీయ క్రికెట్ మండలి భారీ జరిమానా విధించింది. సిరీస్‌లో రెండోదైన రాయ్‌పూర్ వన్డేలో నిర్ణీత సమయంలోపు ఓవర్లు పూర్తి చేయనుందన.. భారత క్రికెటర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించింది ఐసీసీ. ఈ విషయాన్ని సోమవారం ఐసీసీ వెల్లడించింది.

స్వదేశంలో దక్షిణాఫ్రికాకు టెస్టు సిరీస్ సమర్పించుకున్న భారత జట్టు వన్డేల్లో మాత్రం పంజా విసిరింది. రాంచీ వన్డేలో ఉత్కంఠ విజయంతో సిరీస్‌లో బోణీ కొట్టిన టీమిండియా.. విరాట్ కోహ్లీ(105), రుతురాజ్ గైక్వాడ్(102) శతకాల మోతతో రాయ్‌పూర్‌లోనూ ప్రత్యర్థికి పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించింది. 359 పరుగుల రికార్డు లక్ష్యాన్ని సఫారీ టీమ్ మరో నాలుగు బంతులు ఉండగానే అందుకుని సిరీస్ సమం చేసింది. అయితే.. ఈ మ్యాచ్‌లో టీమిండియా 2 ఓవర్లు వెనకబడింది. ఈ విషయాన్ని గుర్తించిన రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఐసీసీ దృష్టికి తీసుకెళ్లారు.

ఐసీసీ నిబంధనల్లోని ఆర్టికల్ 2.22 ప్రకారం స్లో ఓవర్ రేటుకు జట్టు సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇదే విషయమై విచారణ సందర్భంగా కెప్టెన్ కేఎల్ రాహుల్ తన పొరపాటును అంగీకరించాడు. టీమిండియా ఆటగాళ్లకు ఫైన్ విధించాలనే నిర్ణయాన్ని ఆన్ ఫీల్డ్ అంపైర్లు రాడ్ టక్నర్, రోహన్ పండిట్.. థర్డ్ అంపైర్ సామ్ నొగజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ జయరామన్ మదన్‌గోపాల్ ఆమోదించారు. దాంతో.. రాయ్‌పూర్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా భారత క్రికెటర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది ఐసీసీ. కీలకమైన మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.

### ఫిడే సర్క్యూట్‌లో విజయం..
## కాండిడేట్స్ బరిలో ప్రజ్ఞానంద..!



**న్యూఢిల్లీ:** భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద ఫిడే సర్క్యూట్ 2025 టోర్నీలో విజేతగా నిలిచాడు. లండన్ చెస్ క్లాసిక్ ఓపెన్‌లో ఆఖరి నిమిషంలో అడుగుపెట్టిన టీమిండియా స్టార్ సంచలన విజయాలు నమోదు చేశాడు. వచ్చే ఏడాది జరుగబోయే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాడు. ఫిడే ర్యాపిడ్, ఫిడే బ్లిట్జ్ రౌండ్ ఫలితాలతో సంబంధం లేకుండా కాండిడేట్స్ బెర్త్ సాధించాడు ప్రజ్ఞానంద. ఫిడే సర్క్యూట్ 2025లో ప్రజ్ఞానంద సూపర్ ఫామ్ కొనసాగించాడు. హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్లిన భారత స్టార్ మనదేశం నుంచి క్యాండిడేట్స్‌కు ఎంపికైన నాలుగో ప్లేయర్. అతడికంటే ముందు కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్, ప్రజ్ఞానంద సోదరి ఆర్ వైశాలి ఈ మెగా టోర్నమెంట్‌కు అర్హత సాధించారు.

ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో టాప్3లో నిలవడం ద్వారా దివ్య, హంపి, వైశాలి బెర్తు దక్కించుకున్నారు. ఇతర దేశాల గ్రాండ్‌మాస్టర్లు.. అనిశ్ గిరి, ఫాబియానో కరౌనా, మథియస్ బ్లూబౌమ్, జవొఖిర్ సిండరోవాలు సైతం క్యాండిడేట్స్‌కు క్వాలిఫై అయ్యారు.

## నెట్స్‌లో చెమటోడ్చిన గిల్..
### పాండ్యా మెరిసేనా..!

**న్యూఢిల్లీ:** స్వదేశంలో టెస్టు సిరీస్‌లో ఎదురైన వైట్‌వాష్‌కు దక్షిణాఫ్రికాపై వన్డే విక్టరీతో ప్రతీకారం తీర్చుకుంది భారత జట్టు. 2-1తో వన్డే సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా.. తమకు అచ్చొచ్చిన పొట్టి ఫార్మాట్‌లోనూ సఫారీలను చిత్తు చేయాలనుకుంటోంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో వరుసగా సిరీస్‌లు గెలుస్తున్న భారత్ .. రేపు బరామతి స్టేడియంలో బోణీ కొట్టాలనే పట్టదలతో ఉంది. మెడ గాయం నుంచి కోలుకున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి టీ20 కోసం నెట్స్‌లో చెమటోడ్చాడు.

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అదరగొట్టిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా టీమిండియా తరఫున మెరవాలని భావిస్తున్నాడు. అయితే.. అతడు సోమవారం నెట్స్ సెషనల్‌లో పాల్గొనలేదు. కానీ, గిల్ మాత్రం రెండు గంటలు అన్ని రకాల షాట్లు ప్రాక్టీస్ చేశాడు. తిలక్ వర్మ, శివం దూబే, సుందర్.. బౌలింగ్ దళంలోని బుమ్రా, కుల్దీప్, వరుణ్, అర్ష్‌దీప్ నెట్స్‌లో గడిపారు. అయితే.. గిల్, పాండ్యా రాకతో తుదిజట్టు ఎంపిక ఆసక్తి రేపుతోంది. వికెట్‌కీపర్‌గా సంజూ శాంసన్‌ను తీసుకుంటారా? జితేశ్ శర్మ ఛాన్స్ ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. భారత తుది జట్టు అంచనా : అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా,



శివం దూబే, అక్షర్ పటేల్, సంజూ శాంసన్ / జితేశ్ శర్మ(వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

## పుమాకు బైబై..
# స్టార్టప్ కంపెనీ ప్రచారకర్తగా కోహ్లీ..!

**న్యూఢిల్లీ:** వన్డేల్లో శతకాలతో రెచ్చిపోతున్న సీనియర్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కీలక నిర్ణయం తీసుకున్నాడు. కొన్నాళ్లుగా పుమా బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించిన విరాట్ ఆ సంస్థకు గుడ్ బై చెప్పేశాడు. భారత్‌కు చెందిన 'అజిలిటస్' స్టార్టప్ కంపెనీలో భాగస్వామిగా చేరాడు విరాట్. ఈ విషయాన్ని సోమవారం కోహ్లీ వెల్లడించాడు. అయితే.. తమ ఒప్పందాన్ని పునరుద్ధరించడం కోసం కోహ్లీకి పుమా రూ.300 కోట్లు ఆఫర్ చేసిందట. అయినా సరే అంత పెద్ద మొత్తాన్ని సైతం కాదని అజిలిటస్‌తో డీల్ కుదుర్చుకున్నాడు రన్ మెషీన్.

క్రికెట్ ఐకాన్ విరాట్ కోహ్లీ ఓవైపు మైదానంలో అదరగొడుతూనే.. మరోవైపు వ్యాపారంలోనూ రాణిస్తున్నాడు. ఇప్పటికే రెస్టారెంట్ బిజినెస్.. డిజిట్ ఇన్స్యూరెన్స్ కంపెనీలతో భారీగా అర్జిస్తున్న విరాట్ తాజగా కొత్త స్పోర్ట్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత ఏనిమిదేళ్లుగా పుమాతో కొనసాగిన కోహ్లీ.. ఈసారి స్వదేశీ అంకుర సంస్థ అజిలిటస్‌కు జై కొట్టాడు. దిగ్గజ కంపెనీ అయిన పుమాను వదిలేసి.. ఈ స్టార్టప్ కంపెనీ వైపు మొగ్గు చూపడానికి కారణం ఏంటి? అని ప్రశ్నించగా.. ఈ రోజు నుంచి కొత్త అధ్యాయం మొదలవ్వనుంది. స్పష్టమైన లక్ష్యం, మంచి ఉద్దేశంతో వన్ 8, అజిలిటస్ మధ్య కొత్త ప్రయాణం షురూ కానుంది. వన్ 8ను అజిలిటస్ బ్రాండ్‌తో మరింత ముందుకు తీసుకెళ్తా.

అజిలిటస్ గంగూలీ నుంచి ఆఫర్ రాగానే నన్నే ఎందుకు ఎంచుకున్నారో అర్థమైంది. క్రీడా దుస్తులు, పరికరాల




తయారీలో వీరి నైపుణ్యం బాగుంది. కచ్చితంగా ఇది నాకు గొప్ప అవకాశం అనిపించింది. అందుకే భాగస్వామిగా చేరాను. ముఖ్యంగా అజిలిటస్ మనదేశపు సంస్థ. మనవాళ్లే డిజైన్లు రూపొందిస్తారు. అందుకే.. ఓకే చెప్పాను అని కోహ్లీ ఒక వీడియోలో వెల్లడించాడు. అజిలిటస్‌లో రూ.40 కోట్లు పెట్టుబడి పెట్టిన విరాట్ 1.94 శాతం వాటా దక్కించుకున్నాడు.

### 52వ సెంచరీతో

ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్న విరాట్ కోహ్లీ బ్యాట్‌తో పరుగుల ప్రవాహం కొనసాగిస్తున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో రెండు డకౌట్ల తర్వాత అర్ధ శతకంతో ఫామ్ అందుకున్న విరాట్.. స్వదేశంలో శతకాలతో చెలరేగాడు. రాంచీ వన్డేలో దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికేస్తూ 52వ సెంచరీతో సచిన్ టెండూల్కర్ 'ఆల్‌టైమ్ రికార్డు' బ్రేక్ చేశాడీ రన్ మెషీన్. అనంతరం రాయ్‌పూర్‌లోనూ అదే జోరు చూపించి.. శతక్కొట్టాడు.

చివరిదైన వైజాగ్ వన్డేలోనూ హాఫ్ సెంచరీతో వీరవిహారం చేసిన కోహ్లీ.. 302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. వచ్చే వన్డే ప్రపంచకప్ సన్నద్ధతలో ఉన్న ఈ స్టార్ ప్లేయర్ దేశవాళీలో ఆడేందుకు ఓకే చెప్పాడు. దాదాపు 16 ఏళ్ల తర్వాత విరాట్ వన్డే ఫార్మాట్లో జరుగనున్న 'విజయ్ హజారే ట్రోఫీ'లో ఢిల్లీ తరఫున ఆడబోతున్నాడు.

MOVIE TIME

## 20 నిముషాల పాటు వెంకీ సందడి

దర్శకుడు అనిల్ రావిపూడి



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చిత్రం మన శంకర వర ప్రసాద్ గారు. 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. వెంకటేశ్ కామియో రోల్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీలో వెంకీ, చిరు పాటకు సంబంధించిన వార్తతో సినిమాపై అంచనాలు పెరిగి పోతున్నాయి. ఈ చిత్రంలో వెంకటేశ్ ఎంతసేపు కనిపించబోతున్నాడనే దానిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాన్ని షేర్ చేశాడు అనిల్ రావిపూడి. వెంకటేశ్ ఇందులో సుమారు 20 నిమిషాలు కనిపిస్తాడని చెప్పాడు. అంతేకాదు క్లైమాక్స్‌లో చిరంజీవి, వెంకటేశ్ మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతాయని క్లారిటీ ఇచ్చేశాడు. ఈ కామెంట్స్‌తో మూవీ లవర్స్‌కు ఫుల్ మీల్స్ వినోదాన్ని గ్యారంటీ అని చెప్పకనే చెబుతున్నాడు అనిల్ రావిపూడి.

## భర్త మహాశయులకు విజ్ఞప్తి నుంచి మరో పాట




**టాకీస్:** టాలీవుడ్ యాక్టర్ రవితేజ ప్రస్తుతం కిశోర్ తిరుమల దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే నయా టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, ఖిలాడి ఫేం డింపుల్ హయతి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ సాంగ్ విడుదల చేయగా మ్యూజిక్ లవర్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా సెకండ్ సింగిల్ అద్దం ముందు అప్‌డేట్ అందించారు. రవితేజ, డింపుల్ హయతి కాంబోలో రానున్న ఈ సాంగ్ ప్రోమోను డిసెంబర్ 10న సాయంత్రం 6:03 గంటలకు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. రవితేజ, డింపుల్ హయతి సూపర్ కూల్ ట్రాక్‌తో సాంగ్ విజువల్స్ ఉండబోతున్నట్టు తాజా లుక్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




## తగ్గని మెరుపులు..

### లాంగ్ గ్యాప్ తర్వాత కియారా అద్వానీ బ్యాక్ టు షూట్

**టాకీస్:** తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని ముద్దుగుమ్మల్లో ఒకరు కియారా అద్వానీ. భరత్ అనే నేను, వినయ విధేయ రామ సినిమాలతో టాలీవుడ్‌లో మెరిసింది. హిందీలో వన్ ఆఫ్ ది లీడింగ్ భామల్లో ఒకరిగా కొనసాగుతున్న ఈ ముద్దుగుమ్మ తన కోస్టార్, బాలీవుడ్ యాక్టర్ సిద్దార్థ్ మల్హోత్రాను పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. కియారా-సిద్దార్థ్ కపుల్ ఈ ఏడాది జులై 15న పండంటి కూతురుకు స్వాగతం పలికారు. ప్రెగ్నెన్సీ, డెలివరీ కారణంగా చాలా కాలంగా మేకప్ వేసుకోని ఈ బ్యూటీ మళ్లీ కెమెరా ముందు ప్రత్యక్షమైంది. కియారా అద్వానీ ఆఫ్ షోల్డర్ షర్ట్, షార్ట్స్‌లో షూటింగ్ లొకేషన్‌కు వచ్చింది. పొట్టి డ్రెస్‌లో హొయలు పోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ప్రస్తుతం కియారా అద్వానీ కన్నడ, ఇంగ్లీష్ బైలింగ్యువల్ డ్రామా టాక్సిక్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కియారా అద్వానీ కూతురు పుట్టిన తర్వాత కూడా మునుపటిలా మెస్మరైజింగ్ లుక్‌లో కనిపిస్తున్న స్టిల్స్, విజువల్స్ నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి.

## మీరు ఊహించని మరో చీకటి ప్రపంచం

### మరో హారర్ మూవీ ఈషా ట్రైలర్ విడుదల

**టాకీస్:** ఇటీవలే లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించారు బన్నీవాస్, వంశీ నందిపాటి. ఈ కాంబో తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతుంది. రాజు వెడ్స్ రాంబాయి ఫేం అఖిల్‌రాజ్‌తోపాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ మూవీలో హెబ్బాపటేల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్నిడిసెంబర్ 12న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించిన ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌ను గమనిస్తే.. ఇప్పటి వరకు వచ్చిన రెగ్యులర్ హారర్ థ్రిల్లర్ జానర్‌లో ఇదొక ఆసక్తికరమైన పాయింట్‌తో అల్లుకున్న భయపెట్టే కథ అనిపిస్తుంది. సినిమా రెగ్యులర్ హారర్ ఫార్ములాకు భిన్నంగా ఉండేలా కనిపిస్తుంది. మీరు ఊహించని చీకటి ప్రపంచం మరొకటి ఉంది అని ట్రైలర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ప్రేక్షకులు ఉలిక్కిపడే ట్విస్ట్‌లు పుష్కలంగా ఉన్నాయని పిస్తుంది. దెయ్యాలు, ఆత్మలు లేవని బలంగా నమ్మే స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎక్స్ పోజ్ చేయడానికి బయలుదేరిన వీరికి, బాబ్లూ పృథ్వీరాజ్ రూపంలో ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్ తో వీరు ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడతారు. సైన్స్‌కు, అతీంద్రియ శక్తులకు మధ్య జరిగే క్లాష్ దీన్ని ఆసక్తికరంగా మలిచారు. ట్రైలర్‌లోని విజువల్స్ చాలా వరకు బ్లూ అండ్ డార్క్ థీమ్‌లో సాగాయి. ముఖ్యంగా ఆ పాడుబడిన బంగ్లా, అక్కడ నేల మీద వేసి ఉన్న యంత్రాలు, క్షుద్ర పూజల సెటప్ సినిమాలోని మూడ్ ని ఎలివేట్ చేశాయి. కెమెరామెన్ సంతోష్ లైటింగ్ వాడిన విధానం, దానికి ఆర్ఆర్ ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తోడై కొన్ని చోట్ల ఉలిక్కిపడేలా చేశాయి. సౌండ్ డిజైన్ హర్రర్ సినిమాలకు ఎంత ముఖ్యమో ఈ సినిమా సౌండ్ డిజైనింగ్ ఎగ్జాంపుల్‌గా నిలుస్తుందేమో అనిపిస్తుంది. డిసెంబర్ 12న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ట్రైలర్ చివరలో వచ్చే ట్విస్ట్ లు, ఫాస్ట్ కట్స్ సినిమా మీద ఒక క్యూరియాసిటీని అయితే క్రియేట్ చేశాయి.



## రాజాసాబ్‌కు రిలీజ్ కష్టాలు లేవు

### పీపుల్ మీడియా అధినేత విశ్వప్రసాద్



**టాకీస్:** బాలకృష్ణ 'అఖండ 2' సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూడగా, ఆ సినిమా అనూహ్యంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటుందేమో అన్న ఆందోళన సోషల్ మీడియాలో వ్యక్తమవుతోంది. ఎందుకంటే ఈ సినిమా గత ఏడాది నుంచి వాయిదాలు పడుతూ వస్తోంది. కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి చెందిన ఎ÷ఎజ ఎంట్టంల్గ÷న్మెంట్ సంస్థ, 'రాజాసాబ్'లో తాము పెట్టిన 218 కోట్ల పెట్టుబడికు సంబంధించిన ఒప్పందాలు ఉల్లంఘించబడ్డాయంటూ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నిర్మాణ సంస్థ ప్రాజెక్టును నిర్దిష్ట టైమ్‌లైన్‌లో పూర్తి చేయలేదని వారు ఆరోపించారు. ఆ వివాదం అప్పటికి సద్దుమణిగినా, ఇప్పుడు అఖండ 2 సమస్యలతో మళ్లీ 'రాజాసాబ్' రిలీజ్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ తాజాగా ఓ ఈవెంట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. రాజాసాబ్ కోసం బయట నుంచి తీసుకున్న పెట్టుబడులన్నీ క్లియర్ చేశాం. అవి వేరే నిధుల ద్వారా పూర్తి చేశాం. కొద్దిపాటి వడ్డీలు మాత్రమే మిగిలాయి. సినిమా బిజినెస్ జరిగే సమయానికి అవి కూడా క్లియర్ అవుతాయి. 'రాజాసాబ్' సంక్రాంతికి ఎటువంటి సందేహం లేకుండా రిలీజ్ అవుతుంది,' అని అన్నారు. సినిమాల రిలీజ్‌కు చివరి నిమిషంలో అడ్డంకులు సృష్టించడం వల్ల బయ్యర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతలు, టెక్నీషియన్స్ మొత్తం వేలాది కుటుంబాలు నష్టంలో పడుతాయి. భవిష్యత్తులో థర్డ్ పార్టీ వ్యక్తులు ఇలాంటి అంతరాయాలు కలిగించకుండా కఠినమైన చట్టపరమైన మార్గదర్శకాలు అవసరం అని స్పష్టం చేశారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్న 'రాజాసాబ్'ను దర్శకుడు మారుతి తెరకెక్కిస్తుండగా, ప్రభాస్ కొత్త అవతారంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. నిర్మాత వ్యాఖ్యలతో ఇప్పుడు ఫ్యాన్స్ కొంతవరకు ఊరటచెందారు.

## అఖండ-2కు తొలగిన అడ్డంకులు

### 12న విడుదలకు మార్గం సుగమం: తమ్మారెడ్డి వ్యాఖ్య

**టాకీస్:** బాలకృష్ణ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తోన్న చిత్రం 'అఖండ 2' ఆర్థిక వ్యవహారల కారణంగా వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. తాజాగా ఈ సినిమా ఇష్యూ క్లియర్ అయిందని టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. డిసెంబర్ 12న 'అఖండ 2' విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరంలో 'హరిహరవీరమల్లు', 'అఖండ 2' విడుదల విషయంలో ఇబ్బందులు వచ్చాయి. నిర్మాతలకు గతంలో ఉన్న ఆర్థికపరమైన కమిట్‌మెంట్‌ల కారణంగా ఇవి తలెత్తాయి. 'హరిహర వీరమల్లు' ఇష్యూ క్లియర్ కాగానే విడుదలైంది. ఇప్పుడు 'అఖండ 2' ఇష్యూ కూడా క్లియర్ అయింది. నా అంచనా ప్రకారం డిసెంబర్ 12న విడుదలయ్యే అవకాశం ఉంది. అందరూ దీనికోసం ఎదురుచూస్తున్నారు కాబట్టి సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తారు' అని అన్నారు. 'సినిమా విడుదల ఆలస్యమైనంత మాత్రాన దాని ఫలితంపై ప్రభావం పడదు. దానికి వచ్చే ఓపెనింగ్స్ అలానే ఉంటాయి. ఓవర్సీస్‌లోనూ 'అఖండ 2' విడుదల కానున్న విషయం తెలిసిందే.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.